చరిత్ర సృష్టించిన బోపన్న

45 ఏండ్ల వయసులో 'డబుల్స్' విజయం

పారిస్: 'వయసు ఒక అంకె' మాత్రమే అని మరోసారి నిరూపించాడు భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న. వన్నె తగ్గని ఆట, ఫిట్‌నెస్‌తో యువ ఆటగాళ్లకు సవాల్ విసురుతున్న బోపన్న.. 45 ఏండ్ల వయసులోనూ టెన్నిస్ మ్యాచ్ గెలిచిన పెద్ద వయస్కుడిగా రికార్డులకెక్కాడు. ఫ్రాన్స్‌లోని మాంటె-కార్లో కంట్రీ క్లబ్ వేదికగా జరుగుతున్న మాంటె-కార్లో మాస్టర్స్‌లో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బెన్ షెల్టన్ (అమెరికా) ద్వయం 6-3, 7-5తో ఫ్రాన్సిస్కో (అర్జెంటీనా)-అలెజంద్రో(చిలీ)పై గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. తద్వారా బోపన్న ఏటీపీ మాస్టర్స్ 1000 ఈవెంట్ చరిత్రలో సింగిల్స్ లేదా డబుల్స్ మ్యాచ్ గెలిచిన పెద్ద వయస్కుడి (45 ఏండ్ల ఒక నెల రోజులు)గా చరిత్ర సృష్టించాడు. గతంలో ఈ రికార్డు కెనడాకు చెందిన డేనియల్ నెస్టర్ పేరిట ఉండేది. 44 ఏండ్ల 8 నెలల వయసులో నెస్టర్.. ఫ్రాన్స్‌కు చెందిన ఫ్యాబ్రిస్ మార్టిన్‌తో కలిసి మ్యాచ్ గెలవడమే ఇప్పటిదాకా రికార్డు. ఆసక్తికరమైన విషయమేంటంటే.. నెస్టర్-ఫ్యాబ్రిస్ కలిసి ఓడించింది బోపన్న-పాబ్లో ద్వయాన్నే కావడం గమనార్హం. 2017లో మాడ్రిడ్ మాస్టర్స్ ఇందుకు వేదికైంది. ఇదిలా ఉండగా మాంటె-కార్లో మాస్టర్స్ డబుల్స్‌లో మరో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది.

ఇంగ్లండ్ సారథిగా బ్రూక్

లండన్: ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టుకు యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ సారథిగా నియమితుడయ్యాడు. ఈ మేరకు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) సోమవారం ఈ విషయాన్ని వెల్లడించింది. కొద్దిరోజుల క్రితమే ముగిసిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో దారుణ వైఫల్యంతో పాటు గత కొంతకాలంగా వరుస ఓటములెదుర్కొని సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న జోస్ బట్లర్ స్థానాన్ని బ్రూక్ భర్తీ చేయనున్నాడు. ఇంగ్లండ్ కెప్టెన్సీ కోసమే బ్రూక్.. ఈ ఏడాది ఐపీఎల్ కాంట్రాక్టునూ వదులుకున్నాడు. 2022లో జట్టుతో చేరిన బ్రూక్.. ఇప్పటిదాకా 26 వన్డేలు ఆడి 34 సగటుతో 816 పరుగులు చేశాడు. గతంలో అండర్-19 ప్రపంచకప్ సందర్భంగా ఇంగ్లండ్‌ను నడిపించిన అనుభవమున్న బ్రూక్.. నిరుడు సెప్టెంబర్‌లో బట్లర్ గైర్హాజరీలో ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ ఏడాది మే నుంచి ఇంగ్లండ్ క్రికెట్‌లో బ్రూక్ శకం మొదలు కానున్నది. మేలో ఇంగ్లండ్.. వెస్టిండీస్‌తో స్వదేశంలో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది.

ఇషాంత్‌పై జరిమానా

హైదరాబాద్: గుజరాత్ టైటాన్స్ సీనియర్ పేసర్ ఇషాంత్‌శర్మపై జరిమానా పడింది. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కారణంగా ఇషాంత్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తున్నట్లు ఐపీఎల్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియామవళి లెవల్-1 తప్పిదం ఆర్టికల్ 2.2 అనుసరించి ఇషాంత్‌పై జరిమానా వేసినట్లు లీగ్ వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో మ్యాచ్ రిఫరీదే తుది నిర్ణయం. ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లాడిన ఇషాంత్ ఒక వికెట్ తీసి 107 పరుగులిచ్చుకున్నాడు.

ఎమ్ఎల్ఆర్ పతక ధమాకా

- జాతీయ మాస్టర్ గేమ్స్‌లో ఐదు పతకాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వయసు ఒక నంబర్ మాత్రమేనని నిరూపించారు మర్రి లక్ష్మణ్‌రెడ్డి(ఎమ్ఎల్ఆర్). ఎనిమిది పదుల వయసులో కుర్రాళ్లకు ఏమాత్రం తీసిపోని విధంగా జాతీయ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా ఐదు పతకాలతో సత్తాచాటారు. చండీగఢ్(పంజాబ్) వేదికగా జరిగిన 7వ జాతీయ స్విమ్మింగ్ టోర్నీలో 81 ఏండ్ల లక్ష్మణ్‌రెడ్డి 400మీటర్ల ఫ్రీస్టయిల్‌తో పాటు 200మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో స్వర్ణాలు, 100మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో రజతం, రిలే ఈవెంట్లలో రెండు కాంస్యాలు సొంతం చేసుకున్నారు. ఐదు పతకాలు సాధించిన లక్ష్మణ్‌రెడ్డిని ఈ సందర్భంగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచే బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్

నింగ్బో (చైనా): ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్‌నకు వేళ్లైంది. చైనాలోని నింగ్బో వేదికగా ఆరు రోజుల పాటు సాగే ఈ టోర్నీలో భారత్ స్టార్ షట్లర్లతో బరిలో నిలిచింది. సాత్విక్-చిరాగ్ ద్వయం తప్పుకున్న నేపథ్యంలో భారత బృందాన్ని పీవీ సింధు, లక్ష్యసేన్ నడిపించనున్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్‌తో పాటు ప్రణయ్, రజావత్, కిరణ్ జార్జి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సేన్ తన తొలి మ్యాచ్‌లోనే కఠిన ప్రత్యర్థి లీ చియా హోతో తలపడనున్నాడు. ఒక వేళ అతడు క్వార్టర్స్ చేరితే అక్కడ ప్రపంచ నంబర్‌వన్ రాంకర్ షి యు కితో ఆడాల్సి ఉంటుంది. మహిళల సింగిల్స్‌లో సింధు, బన్సోద్, అనుపమ, ఆకర్షి బరిలో నిలిచారు. సింధు తొలి రౌండ్‌లో తన కంటే తక్కువ ర్యాంకు కలిగిన ఎస్తర్ నురుమితో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే ఆమె రెండో రౌండ్‌లో జపాన్ అమ్మాయి యమాగుచిని ఢీకొననుంది. డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లోనూ భారత్ నుంచి పలువురు షట్లర్లు బరిలో ఉన్నారు.

ఆర్‌సీబీ అదుర్స్

కృనాల్ నాలుగు వికెట్లతో విజృంభణ

కోహ్లీ, రజత్ హాఫ్ సెంచరీలు

ముంబైపై ఉత్కంఠ విజయం

కృనాల్ (4/45)

కోహ్లీ (67)

ముంబై: ఐపీఎల్‌లో మరో ఉత్కంఠ పోరు అభిమానులను ఊపేసింది. ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెడుతూ ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో ముంబై ఇండియన్స్‌పై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)దే పైచేయి అయ్యింది. సోమవారం వాంఖడేలో జరిగిన హోరాహోరీ పోరులో ఆర్‌సీబీ 12 పరుగుల తేడాతో ముంబైపై అద్భుత విజయం సాధించింది. తొలుత విరాట్ కోహ్లీ(42 బంతుల్లో 67, 8 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ రజత్ పటీదార్ (32 బంతుల్లో 64, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) సమయోచిత ఇన్నింగ్స్‌లకు తోడు ఆఖర్లో జితేశ్ శర్మ (19 బంతుల్లో 40 నాటౌట్, 2 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 221 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆర్‌సీబీ బ్యాటర్ల ధాటికి ముంబై బౌలర్లు సొంత వేదికలో ఘోరంగా విఫలమయ్యారు. గాయంతో మూడు నెలల విరామం తర్వాత ఫీల్డ్‌లోకి వచ్చిన బుమ్రా(0/29) వికెట్లు తీయకపోయినా ఆకట్టుకున్నాడు. రికార్డు ఛేదనలో ముంబై 20 ఓవర్లు ముగిసేసరికి 209/9 స్కోరు చేసింది. తిలక్‌వర్మ(56), హార్దిక్ పాండ్యా(42) పోరాడినా ఫలితం లేకపోయింది. కృనాల్ పాండ్యాకు నాలుగు వికెట్లు దక్కాయి.

ముంబై పోరాడినా:

కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై ఇన్నింగ్స్ ధాటిగానే మొదలైంది. పవర్ ప్లేలో వేగంగా ఆడట్లేదన్న విమర్శలెదుర్కొన్న రోహిత్ (9 బంతుల్లో 17, 2 ఫోర్లు, 1 సిక్స్).. 6, 4, 4తో ఇన్నింగ్స్‌ను జోష్‌తోనే ఆరంభించాడు. యష్ దయాల్ రెండో ఓవర్లో రెండు బౌండరీలు సాధించిన హిట్‌మ్యాన్.. ఇన్‌స్వింగర్‌గా వేసిన నాలుగో బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. భువీ బౌలింగ్‌లో రెండు ఫోర్లు కొట్టిన రికెల్టన్ (17).. హేజిల్‌వుడ్ ఓవర్లో వికెట్ల ముందు బలయ్యాడు. ఈ క్రమ... నుంచి విల్ జాక్స్ (18 బంతుల్లో 22, 2 ఫోర్లు, సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్... రజత్ 28, 5 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించారు. మూడో వికెట్‌కు ఈ జోడీ 41 పరుగులు జతచేసింది. కానీ ఆశించిన స్థాయిలో వేగంగా ఆడకపోయిన ఈ ద్వయం రెండు ఓవర్ల వ్యవధిలో పెవిలియన్ చేరింది. చివరి 8 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 124 పరుగులు అవసరమనగా... సుయాన్స్ 13వ ఓవర్లో తిలక్ 6, 4, 4 తో 17 పరుగులు రాబట్టాడు. హేజిల్‌వుడ్ మరుసటి ఓవర్లో హార్దిక్.. 6, 4, 6, 4 బాదడంతో ముంబైలో గెలుపుపై ఆశలు చిగురించాయి. అదే జోష్‌ను ఆఖరి వరకు కొనసాగించినా కృనాల్ ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి ముంబైకి ఓటమి వైపు నిలిపాడు.

కోహ్లీ కేక..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన బెంగళూరుకు మొదటి ఓవర్ రెండో బంతికే తొలి దెబ్బ తగిలింది. తొలి ఓవర్లలో వికెట్లు తీయడం అలవాటుగా మార్చుకున్న ట్రెంట్ బౌల్ట్ (2020 సీజన్ నుంచి ఫస్ట్ ఓవర్‌లో బౌలింగ్ చేస్తూ అతడు తీసిన వికెట్లు-31).. రెండో బంతికే ఫిల్ సాల్ట్ (4)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. కానీ ఆ ఆనందం ముంబైకి ఎక్కువసేపు నిలువలేదు. పడిక్కల్ (22 బంతుల్లో 37, 2 ఫోర్లు, 3 సిక్సర్లు)తో జతకలిసిన కోహ్లీ.. బెంగళూరు స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. బౌల్ట్ 3వ ఓవర్లో మూడో బంతికి బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ దిశగా పడిక్కల్ భారీ సిక్సర్ బాదాడు. బుమ్రాకు కోహ్లీ సిక్సర్‌తో స్వాగతం పలికాడు. విల్ జాక్స్ 5వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టడంతో 5 ఓవర్లకే ఆర్‌సీబీ స్కోరు 50 పరుగుల మార్కును దాటింది. చాహర్ 6వ ఓవర్లో పడిక్కల్.. 6, 6, 4 బాదడంతో మ్యాచ్‌లో హార్దిక్ మళ్లీ అతడికి బంతినిచ్చే సాహసం చేయలేదు. స్లాగ్‌స్వీప్‌తో సిక్సర్‌గా మలిచిన కోహ్లీ.. 29 బంతుల్లోనే అర్ధసెంచరీని పూర్తిచేశాడు. కానీ అదే ఓవర్లో పడిక్కల్ ఔట్ కావడంతో 91 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

రజత్, జితేశ్ రచ్చ రచ్చ

పడిక్కల్ స్థానంలో వచ్చిన సారథి పటీదార్.. క్రీజులో కుదురుకునేదాకా ఆచితూచి ఆడాడు. తానెదుర్కొన్న తొలి 10 బంతుల్లో రజత్ చేసినవి 8 పరుగులే. కానీ హార్దిక్ 13వ ఓవర్ కోహ్లీ.. హార్దిక్ 15వ ఓవర్లో డీప్ స్క్వేర్ వద్ద నమకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఇదే ఓవర్లో లివింగ్‌స్టన్ బుమ్రా చేతికి చిక్కాడు. కానీ రజత్‌కు జితేశ్ జతకలవడంతో ముంబై బౌలర్లు బెంబేలెత్తిపోయారు. బౌల్ట్ 16వ ఓవర్లో జితేశ్.. 4,6 బాదగా రజత్ ఓ బౌండరీతో 18 పరుగులొచ్చాయి. ఇక హార్దిక్ 17వ ఓవర్లో అయితే ఈ ఇద్దరూ.. 23 పరుగులు పిండుకున్నారు. ఈ ద్వయం ఐదో వికెట్‌కు 27 బంతుల్లోనే 69 పరుగులు జోడించింది. చివరి నాలుగు ఓవర్లలో బెంగళూరు 70 పరుగులు పిండుకుంది.

కోహ్లీ @13 వేలు

ఈ మ్యాచ్‌లో 17 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్దకు చేరగానే కోహ్లీ టీ20 ఫార్మాట్‌లో 13వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. భారత్ నుంచి ఈ జాబితాలో చోటు దక్కించుకున్న తొలి క్రికెటర్‌గా కోహ్లీ రికార్డులకెక్కాడు. ఈ క్రమంలో కోహ్లీ 9 శతకాలు, 98 అర్ధ సెంచరీలు నమోదు చేయడం విశేషం. 386 ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించిన కోహ్లీ ఓవరాల్‌గా ఐదో స్థానంలో నిలిచాడు. క్రిస్ గేల్ (14,562), అలెక్స్ హేల్స్ (13,610), షోయబ్ మాలిక్ (13,557), కీరన్ పొలార్డ్ (13,537) కోహ్లీ కంటే ముందున్నారు.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
ఢిల్లీ	3	3	0	6	1.25
గుజరాత్	4	3	1	6	1.03
బెంగళూరు	4	3	1	6	1.01
పంజాబ్	3	2	1	4	0.07
కోల్‌కతా	4	2	2	4	0.07
లక్నో	4	2	2	4	0.04
రాజస్థాన్	4	2	2	4	-0.18
ముంబై	5	1	4	2	-0.01
చెన్నై	4	1	3	2	-0.89
హైదరాబాద్	5	1	4	2	-1.62

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

సంక్షిప్త స్కోర్లు:

బెంగళూరు: 20 ఓవర్లలో 221/5 (కోహ్లీ 67, రజత్ 64, బౌల్ట్ 2/57, హార్దిక్ 2/45)

ముంబై: 20 ఓవర్లలో 209/9 (తిలక్ 56, హార్దిక్ 42, కృనాల్ 4/45, హేజిల్‌వుడ్ 2/37)

వీరమల్లు ఆగమనం ఆరోజే..

పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' సినిమా మార్చి 28న విడుదల కావాలి. కానీ షూటింగ్ బ్యాలెన్స్ ఉండటంతో సినిమాను మే 9కి వాయిదా వేశారు. ఆ తేదీనైనా ఈ సినిమా వస్తుందా? అనే అనుమానం అభిమానుల్లో లేకపోలేదు. అయితే.. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం మే 9న వీరమల్లు ఆగమనం ఖాయమేనని తెలుస్తున్నది. పవన్‌కల్యాణ్ ఈ నెలాఖరు వరకూ ఈ సినిమాకు డేట్స్ ఇచ్చారు. ఈ వారంలోనే పవన్‌పై బ్యాలెన్స్ షూటింగ్ మొదలు కానుంది. పనిలోపనిగా ప్రమోషన్స్ విషయంలో కూడా దూకుడు పెంచారు. షూటింగ్, పోస్ట్‌ప్రొడక్షన్ రెండూ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి, మే 9న సినిమా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి ఇతర పాత్రధారులు. ఈ సినిమా కొంతభాగాన్ని క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన విషయం తెలిసిందే. ప్రస్తుత దర్శకుడు జ్యోతికృష్ణ. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి,

ధనుష్ హీరోగా త్రివిక్రమ్ సినిమా?

అల్లు అర్జున్, అట్లీ సినిమా ఖరారైపోయింది. ప్రకటన కూడా వచ్చేస్తున్నది. ఈ సినిమా తర్వాత త్రివిక్రమ్‌తో బన్నీ చేతులు కలుపుతారు. ప్రస్తుతం బన్నీ, అట్లీ సినిమా అంటే.. వందల కోట్ల పైమాటే. సినిమా హిట్ అయితే.. వసూళ్లు వెయ్యికోట్ల పైమాటే. దానికి తగ్గట్టే నిర్మాణానికి కూడా టైమ్ తీసుకుంటారు. ఏడాదికి పైనే ఈ సినిమా నిర్మాణం జరుగుతుందని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. అంటే.. ఏడాదికి పైగా బన్నీ కోసం త్రివిక్రమ్ వెయిట్ చేయాల్సిందే. అందుకే.. మధ్యలో ముచ్చటగా ఓ సినిమా చేసేస్తే బాగుంటుంది కదా అని అనుకుంటున్నారట త్రివిక్రమ్. ఇటీవలే తమిళ హీరో ధనుష్‌కి ఓ కథ వినిపించారట. ఆయనక్కూడా కథ బాగా నచ్చిందని తెలుస్తున్నది. త్వరలోనే త్రివిక్రమ్, ధనుష్ సినిమా మొదలు కానున్నట్టు సమాచారం. టాలీవుడ్‌కి చెందిన ఓ భారీ నిర్మాణ సంస్థే ఈ సినిమా నిర్మిస్తుందట. ధనుష్ స్వీయ దర్శకత్వంలో నిర్మించి, నటించిన 'ఇడ్లీ కడై' సినిమా త్వరలో విడుదల కానుంది. అలాగే.. తెలుగు దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఆయన నటించిన 'కుబేర' సినిమా సమ్మర్‌లోనే థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాల పనిని పూర్తి చేసుకొని త్రివిక్రమ్ సినిమా సెట్‌లోకి ఎంట్రీ ఇస్తారట ధనుష్.

శ్రీరాముడి స్ఫూర్తితో 'రామం'

ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని చిత్రాలయం స్టూడియోస్ 'రామం' పేరుతో పాన్ ఇండియా చిత్రానికి శ్రీకారం చుట్టింది. వేణు దోనేపూడి నిర్మాత. లోకమాన్య దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ సినిమాలో ఓ యువహీరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత వేణు దోనేపూడి చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'శ్రీరాముడి ఆదర్శాలు, ధీరత్వం గురించి నేటి తరానికి తెలియజెప్పే కథాంశమిది. ఇండియన్ స్క్రీన్‌ప్లే ఇప్పటివరకు ఈ తరహా కథ రాలేదు. అంతర్జాతీయ సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. వివిధ భాషల్లోని అగ్ర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ సినిమాలో భాగం కానున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు.

భయాన్నే భయపెడతాడు

తమిళ అగ్ర కథానాయకుడు అజిత్ నటించిన బహుభాషా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 10న పానిండియా స్థాయిలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగం ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. విభిన్నమైన అవతారాల్లో నెవర్ బిఫోర్ అన్నట్టుగా ఈ ట్రైలర్‌లో అజిత్ కనిపిస్తున్నారు. కొడుకుని కాపాడుకోవడానికి భయంకరమైన తన పాత జీవితంలోకి తిరిగి వచ్చే ఓ తండ్రి పాత్రలో అజిత్ కనిపిస్తున్నారు. ట్రైలర్‌లో ఆయన పాత్ర చిత్రణ ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. భయాన్నే భయపెడతాడనే డైలాగ్ హీరో క్యారెక్టర్ పవర్‌ని సూచిస్తున్నది. అధిక్ రవిచంద్రన్ మెస్మరైజింగ్ ప్రజెంటేషన్, అజిత్ మాస్ అప్పీల్, అద్భుతమైన విజువల్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్, హాలీవుడ్ స్థాయి యాక్షన్ సినిమాకు హైలైట్స్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అర్జున్ దాస్, ప్రభు, ప్రసన్న, సునీల్ కీలకపాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: అభినందన్ రామానుజం, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, సమర్పణ: గుల్షన్‌కుమార్, భూషణ్‌కుమార్, టి.సిరీస్.

మా చిన్న ప్రేమను మీకందిస్తున్నాం!

చిత్రం

పదమూడేండ్ల క్రితం ఎక్స్‌లో(అప్పట్లో ట్విటర్) ప్రొఫైల్ ఓపెన్ చేశారు సమంత. కానీ ఎందుకో కొనసాగలేకపోయారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టీవ్‌గా ఉండే సామ్.. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్‌లలో బిజీబిజీగా ఉంటారు. ఎక్స్‌లో అకౌంట్ ఉన్నా దాన్ని పెద్దగా పట్టించుకోరు. అయితే.. తాజాగా మళ్లీ ఎక్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు సామ్. 2023లో ఆమె 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' సంస్థ స్థాపించిన విషయం తెలిసిందే. ఇప్పుడా సంస్థపై తీసిన 'శుభం' అనే సినిమా విడుదల కానుంది. ఈ విషయాన్ని ఎక్స్‌లో తెలుపుతూ.. 'పెద్ద కలలతో.. మా చిన్న ప్రేమను మీకందిస్తున్నాం.. ఈ సినిమాను అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నా. ఇది నిజంగా నాకెంతో ప్రత్యేకం. గొప్ప ప్రారంభం కూడా' అంటూ రాసుకొచ్చారు. సామ్ ఒక్కసారిగా ఎక్స్‌లో ప్రత్యక్షమవ్వగానే ఆమె ఫాలోవర్స్ ఆనందం వెలిబుచ్చారు. 'వెల్‌కమ్ బ్యాక్ సామ్..', 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఎక్స్‌లో అంత యాక్టీవ్‌గా లేకపోయినా.. సమంతకు 10.2 మిలియన్ల ఫాలోవర్స్ ఉండటం విశేషం.

గోదారి గట్టుపైన అందమైన కథ

యువనటుడు సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జంటగా నటిస్తున్న చిత్రం 'గోదారి గట్టుపైన'. జగపతిబాబు కీలక భూమిక పోషిస్తున్నారు. సుభాస్ చంద్ర దర్శకుడు. అభినవ్‌రావు నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణదశలో ఉంది. సోమవారం ఈ సినిమా టైటిల్‌తోపాటు ఓ పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ప్రశాంతమైన గోదావరి ప్రాంతాన్ని పోస్టర్ ప్రజెంట్ చేసింది. ఓ చల్లని సాయంత్ర వేళ, ప్రశాంతమైన గోదారి వడ్డున స్నేహితులతో కూర్చుని సమయం గడపడం ఎంత ప్రశాంతంగా ఉంటుందో? ఈ సినిమా కూడా అంత ప్రశాంతంగా ఉంటుందని, అందమైన భావోద్వేగాలతో ఈ కథ నిండి ఉంటుందని, గోదావరి జిల్లాలోని వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని, అందుకే 'గోదారి గట్టుపైన' అనే టైటిల్ పెట్టామని, ఈ టైటిల్ సినిమాకు యాప్ట్ అని మేకర్స్ తెలిపారు. రాజీవ్‌కనకాల, లైలా, దేవిప్రసాద్, సుదర్శన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిసంతోష్, సంగీతం: నాగవంశీకృష్ణ.

ముచ్చటగా సాగే బంధాలే..

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా విజయశాంతి కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. ఈ నెల 18న భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ వేగం పెంచారు. 'ముచ్చటగా బంధాలే..' అంటూ సాగే రెండో గీతాన్ని ఈ నెల 9న విడుదల చేయబోతున్నారు. చిత్తూరులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ పాటను విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు. తల్లీకొడుకు మధ్య ఉండే అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ భావోద్వేగభరితంగా ఈ పాట సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని, ఐపీఎస్ వైజయంతీగా విజయశాంతి నటన ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. సోహైల్‌ఖాన్, సాయిమంజ్రేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, రచన-దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి.

వచ్చినవాడు గౌతమ్

అశ్విన్‌బాబు హీరోగా రూపొందుతోన్న మెడికల్ యాక్షన్ మిస్టరీ 'వచ్చినవాడు గౌతమ్'. మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకుడు. టి.గణపతిరెడ్డి నిర్మాత. నిర్మాణంలో ఉన్న ఈ సినిమా నుంచి ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. బ్లెడ్ అండ్ స్టెత్‌తో ఉన్న అశ్విన్‌ను ఈ లుక్‌లో చూడొచ్చు. 90శాతం నిర్మాణం పూర్తయింది. బ్యాలెన్స్ షూటింగ్, పోస్ట్‌ప్రొడక్షన్ పూర్తి చేసి త్వరలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. రియా సుమన్, అయేషాఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అభినయ, అజయ్, అమర్‌దీప్,వీటీవీ గణేష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎం.ఎన్. బాల్‌రెడ్డి, సంగీతం: గౌరహరి, నిర్మాణం: అరుణశ్రీ ఎంటర్టైన్మెంట్స్.

హృద్యమైన ప్రణయగాథ

అంకిత్ కొయ్య, నీలఖి పాత్ర జంటగా నటిస్తున్న చిత్రం 'బ్యూటీ'. జేఎస్ఎస్ వర్ధన్ దర్శకుడు. అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మాతలు. ఇటీవల ఈ సినిమా నుంచి 'కన్నమ్మ కన్నమ్మ' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన